# అనగనగా ఒక కథ

**బ్నిం**

# అన్నపూర్ణ ఉత్తరం

''ఒరేయ్ రాజూ రెండు మూడు రోజుల్నించి నీతో ఒక విషయం మాట్లాడాలని ఎలా మొదలెట్టాలో తెలియక మథన పడుతున్నాను''

''చెప్పరా శంకర్ నా దగ్గర నీకు మొహమాటం ఏంటి'' అన్నాడు రాజు.

''అదేరా! ఎలా చెప్పాలో... అదే నీకెలా చెప్పాలా?'' అని నసిగాడు శంకర్. ''మీ అమ్మాయి ఉత్తరం రాసిందిరా''!



''ఎవరికిరా శంకర్?''

''నాకే, దానికి జవాబు ఏమివ్వాలో తెలియక, తేలక సతమతమవుతున్నానురా! ఈ విషయం నీకు చెప్పకుండానే సాల్వ్ చెయ్యగలననుకున్నాను'' అంటూ ఉత్తరమిచ్చాడు శంకర్.

రాజు ఉత్తరం చదవడం మొదలెట్టాడు.

చేతులొణుకుతున్నాయ్.

కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయ్.

''డియర్ అంకుల్,

నాకు ఇవ్వాళ నుంచి అంకులని పిలవాలని లేదు. 'ఏవండీ' అని సంబోధించాలని ఉంది. ఇలా అంటున్నానని మీరెలా అనుకుంటారో తెలీదు. ఆంటీ చనిపోయినప్పుడు నాకీ ఊహ లేదు.

అప్పటికి నాకు పెళ్లయిపోయింది. ఆంటీయే నన్ను పెళ్లి కూతుర్ని చేసింది-

గోరింటాకు పెట్టింది!

అతను తాళి కడుతూన్నప్పుడు నా జడ ఎత్తి పట్టుకుంది.

నన్ను తన ఇంటిమనిషిలా ప్రేమించింది!

తనని చెల్లిలా చూడాలో అక్కలా చూడాలో నాకు అర్థం కాలేదు.

పెళ్లయిన ఏడాదికి నా అదృష్టం అడుగంటింది. ఆయన వెళ్లిపోయారు.

కడుపులో పడుకున్న

బిడ్డతో నేను పుట్టింటికి వచ్చేశాను.

అంటీ... ఉంటే నన్ను కడుపులో పెట్టుకుని చూసేది.

నా అదృష్టం ఇలా ఉంది? - అనుకుని విచారిస్తున్నప్పుడు..

ఒంటరి పోరాటం చేస్తున్న మీరు మంచం ఎక్కారు.

మీకు జరిగిన యాక్సిడెంట్ చిన్నదే.

రెండు నెలల్లో కోలుకుంటారు. నాకు జరిగిన యాక్సిడెంట్ జీవితాంతం కోలుకోలేనిది!

మీకు అభ్యంతరం లేకపోతే జీవితాంతం మీకు తోడుగా ఉంటాను.

మీ డబ్బు ఆశించి కాదని మీకూ తెలుసు.

మీరు నాకో రక్షణగా ఉంటే... నన్ను పెళ్లి చేసుకుంటే... అది తప్పనుకోవట్లేదు. మీకు అభ్యంతరం లేకపోతే నాన్నగారితో మాట్లాడతాను. ఆయన్ని ఒప్పిస్తాను.

మనం నలుగురం ఒకింట్లోనే ఉందాం!

నేనేదో ఒక ఉద్యోగం చేసుకుని నా కూతుర్ని మీ ఇద్దర్నీ చూసుకుంటాను!

ఈ సామాజిక రక్షణ నాకు మీరు ఇవ్వగలరని భావించచ్చా - పిచ్చిది - పిల్లది అనుకోవద్దు.

నిజమే మీ వయస్సు మా నాన్నగారంత ఉండొచ్చేమో. ఇలాటి ప్రపోజలు మీ దగ్గరే తేగలను. నేనెప్పుడూ ఎవరి ప్రేమలోనూ పడలేదు. మీలో మంచితనం, మాట్లాడే తనం నాకు మొదట్నుంచీ ఇష్టం. ఆ విషయం నాకు తెల్సేటప్పటికి మీకు సేవ చేసే అవకాశం కలిగింది. నేను మీకెంత అవసరమో తెలిసింది. మీరూ ఎవ్వరికీ జవాబు చెప్పుకోనక్కర్లేదు. నేనూ ఎవ్వరి పర్మిషనూ తీసుకోనక్కర్లేదు.

'నీవే తల్లివి, తండ్రివి

నీవే నా తోడు, నీడ, నీవే సఖుడా

నీవే గురుడా దైవము

నీవే నా పతియు, గతియు నిజముగ కృష్ణా'

అని నాకు చిన్నప్పుడు కృష్ణ శతకంలో పద్యం నేర్పించారు. ఇప్పుడు నే కోరుతోన్న కోరికలో మీకు తప్పు కనిపిస్తే నేన్నేర్చుకున్న పాఠం తప్పయ్యుండాలి. నా కోరికను కాదనరు కదూ! మీ దాన్ని కావాలనుకునే

మీ

అన్నపూర్ణ''

ఉత్తరం చదివిన రాజు చాలా సేపు మాట్లాడలేకపోయాడు. ''అన్నపూర్ణ ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందనుకోలేదురా! నేనంటే అభిమానమే అనుకున్నా. పాపం తన బతుకలా అయ్యిందని జాలిపడ్డాను. నా ఆప్యాయతని ఆ అమ్మాయి అపార్థం చేసుకుందా? ఇందులో నా తప్పెంత, అనేది అర్థం చేసుకోలేకపోతున్నాను'' అన్నాడు శంకర్.

''నువ్వు అప్పాని అపార్థం చేసుకుంటున్నావా?'' అన్నాడు అన్నపూర్ణ తండ్రి రాజు.

ఏమాట్లాడలేకపోయాడు శంకర్.

''అన్నపూర్ణ మంచి నిర్ణయం తీసుకుందిరా. నిన్నింక ఏరా అనకూడదు. అల్లుడూ అనచ్చు''

''ఏం మాట్లాడుతున్నావ్? నువ్వీ విషయాన్ని సమర్థించచ్చా? నువ్వు అన్నపూర్ణని మందలించి దార్లో పెడతావని నీకే విషయం చెప్పాను''

''చూడు శంకర్ అన్నపూర్ణ తెలివి తక్కువగా ఏ నిర్ణయం తీసుకోదు.''

''నాకో కూతురుంటే అన్నపూర్ణ వయస్సులో ఉండేది.''

''నాకు తెలుసు అన్నపూర్ణని దురదృష్టం వెంటాడినా మనింటికే తరుంకొచ్చింది. నీ గుండెల్లో తల్దాచుకుంటానంది తను. కాదనకయ్యా.''

★ ★ ★

ఆ తర్వాత మరో నలభయ్యేళ్లు అన్నపూర్ణ శంకర్ భార్యలా బతికి ఆనందాన్ని అనుభవించింది.

శంకర్, అన్నపూర్ణ పోయాకా ఎక్కువ గంటలు బతకలేదు. పునిస్త్రీగా అన్నపూర్ణను సాగనంపి ఆ మర్నాడే ఆవిడ దగ్గరికి ప్రయాణమై వెళ్లిపోయాడు.

అన్నపూర్ణ కూతురుకి తన తండ్రి శంకర్ కాదని ఇప్పటికీ తెలియదు.

☆

## విద్యకు మనసైనవాడు?

**విద్యాబాలన్-జాన్ అబ్రహాంల గురించిన వార్తలు బాలీవుడ్‌లో జోరుగా ప్రచారంలోకి వచ్చేశాయి. దాంతో విద్యాబాలన్ తక్షణ స్పందించింది. 'అసలు మా ఇద్దరి మధ్య ఎలాంటి ఎఫైర్లూ లేవు. ఒక్క సినిమాలో కలిసి నటిస్తున్నంత మాత్రన్నే ఇలాంటి పుకార్లు పుట్టిస్తున్నారు. నా మనసుకు నచ్చిన వాడు ఇంకా తారసపడలేదు నాకు. నిజంగా నా మనసుని ఆకట్టుకున్నవాడు ఎదురైతే సినిమాలకు గుడ్‌బై చెప్పేసి పెళ్లి చేసుకుని లైఫ్‌లో సెటిల్ అవుతా' అంటోంది విద్యాబాలన్.**

